క్లుప్తంగా

75 శాతం సర్వే పూర్తి

కొత్తపల్లి: మండల పరిధిలోని గ్రామాల్లో జగనన్న సురక్ష సర్వే జోరుగా సాగుతోంది. ఇప్పటి వరకూ 75 శాతం సర్వే పూర్తయినట్టు ఎంపీడీఓ అబ్రహం లింకన్ తెలిపారు. వాకతిప్పలో జరుగుతున్న సర్వేను గురువారం ఆయన పరిశీలించారు. మండలంలో కొత్తపల్లి, ఉప్పాడ 1,2, కుతుకుడుమిల్లి గ్రామ సచివాలయాల పరిధిలో సర్వే చివరి దశకు చేరుకుందన్నారు. శుక్రవారం నుంచి ఉప్పాడ 3, గొర్సలో సర్వే ప్రారంభమవుతుందని చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సామర్లకోట: మాధవపట్నం గ్రామంలోని విద్యుత్ సబ్ స్టేషన్ మరమ్మతుల వల్ల శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మాధవపట్నం, ఆటోనగర్, వీకే రాయపురం, సత్యవరపుపేట, బోయనపూడి గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీ ఈపీ డీసీఎల్ ఈఈ ఏఈఎన్‌డీఎస్ ప్రభాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు కౌన్సిల్ సమావేశం

సామర్లకోట: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం శుక్రవారం ఉదయం 11 గంటలకు ప్రారంభం అవుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ తెలిపారు. ఈ సమావేశానికి అధికార, ప్రతిపక్ష సభ్యులు, ఆయా శాఖలకు చెందిన అధికారులు హాజరు కావాలన్నారు.

క్రిస్టియన్ మైనార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎండ్లూరి


ఎండ్లూరి ప్రభాకర్

సామర్లకోట: వైఎస్సార్ సీపీ జిల్లా క్రిస్టియన్ మైనార్టీ ఉపాధ్యక్షునిగా జూనియర్ కళాశాల కాంట్రాక్ట్ అధ్యాపకుడు ఎండ్లూరి ప్రభాకర్ ఎంపిక అయ్యారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు దడాల జాషువా గిరి నుంచి ఉత్తర్వులు వచ్చాయని ప్రభాకర్ గురువార సాయంత్రం విలేకర్లకు తెలిపారు. పెద్దాపురం నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగుర వేయడానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

నేతన్న నేస్తం సర్వే పూర్తి


వాకతిప్పలో నేతన్న నేస్తం సర్వే చేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్

కొత్తపల్లి: మండలంలో 5వ విడత నేతన్న నేస్తం సర్వే పూర్తయినట్టు ఎంపీడీఓ అబ్రహం లింకన్ గురువారం తెలిపారు. అన్ని గ్రామాల్లోనూ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్‌లు పారదర్శకంగా సర్వే చేశారన్నారు. అర్హులైన చేనేత కార్మికుల ధ్రువీకరణ పత్రాలతో పాటు బయోమెట్రిక్ తీసుకుని వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు తెలిపారు. సుమారు 630 పేర్లను సర్వేలో నమోదు చేశామన్నారు. గతేడాది నాల్గో విడత నేతన్న నేస్తంలో మండలంలో 584 మంది లబ్ధి పొందారని చెప్పారు.

మోటారు సైకిల్ చోరీ

సామర్లకోట: స్థానిక మాండవ్యనారాయణ స్వామి ఆలయం వద్ద ఒక భక్తుని మోటారు సైకిల్ గురువారం చోరీకి గురైంది. స్వామివారి దర్శనానికి వచ్చిన అనపర్తి గ్రామానికి చెందిన తాడి బసవరెడ్డి వాహనం ఏపీ 39 సీబీ 6279 నెంబరు గల యాక్టివా చోరీకి గురైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు సీఐ కె.దుర్గాప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పన్ను చెల్లింపునకు నేడు తుది గడువు

- రేపటి నుంచి రెండు శాతం వడ్డీ

కాకినాడ: ప్రస్తుత 2023–24 మొదటి అర్ధ సంవత్సరానికి ఆస్తి, ఖాళీ స్థలాల పన్నును జూన్ 30వ తేదీలోపు వడ్డీ లేకుండా చెల్లించవచ్చునని నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ రావిరాల చెప్పారు. ఒకటో తేదీ తరువాత చెల్లించే బకాయిలకు 2 శాతం వడ్డీ పడుతుందన్నారు. కాకినాడ నగరపాలక సంస్థ పరిధిలోని ఆస్తి పన్ను, ఖాళీ స్థలాల పన్ను చెల్లించాల్సిన ప్రజలు శుక్రవారం సాయంత్రంలోపు పన్ను చెల్లించాలని సూచించారు. ఆయా సచివాలయాల్లోను, నగరపాలక సంస్థ కార్యాలయాల వద్ద పన్నులు స్వీకరిస్తారని కమిషనర్ చెప్పారు.

వైభవంగా సాయిబాబా ఆలయ రజతోత్సవాలు

బోట్‌క్లబ్: స్థానిక రిజర్వులైన్ అయ్యప్పస్వామి ఆలయంలోని సాయిబాబా ఆలయ రజతోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభయ్యాయి. ఉదయం కాకడ హారతి, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. సాయినాథ హోమం నిర్వహించారు. సాయంత్రం బాబాను హంసవాహనంపై ఊరేగించారు. అయ్యప్పస్వామి ఆలయం నుంచి భానుగుడి మీదుగా శ్రీరామ్‌నగర్ వీధుల్లో ఊరేగింపు సాగింది. మహిళలు కోలాటం నిర్వహించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ పర్సన్ ఇన్‌చార్జి గోపాలకృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

సాగునీరా?

- క్లోజర్ కాలం నిరుపయోగం
- పూడిక తీతలో నిర్లక్ష్యం
- కొత్త నీరు వచ్చేస్తున్నా టెండర్ల ప్రక్రియలో జాప్యం


వేట్లపాలెంలో దమ్ములు చేసుకొంటున్న రైతులు

సామర్లకోట: ఏటా సకాలంలో గోదావరి నీరు విడుదలవుతున్నా స్థానిక అధికారుల నిర్లక్ష్యంతో అన్నదాతకు అవసరమైన నీరు అందడం లేదు. కాలువల మూసివేతకు మళ్లీ వదలడానికి మధ్య నెల రోజుల వ్యవధి ఉంటుంది. ఈ కాలంలో కాలువల్లో పేరుకున్న గుర్రపు డెక్క, తూడు తొలగిస్తే అన్నదాతకు అవసరమైన నీరు అంతరాయం లేకుండా అందుతుంది. ఇటీవల కురిసిన వర్షాలకు, గోదావరి కాలువలో నీరు రావడంతో రైతులు సాగుకు సిద్ధమవుతున్నారు. కాగా గుర్రపు డెక్కకు తోడు నీటి మట్టం తక్కువ ఉండడంతో పంట కాలువలోకి నీరు ఉండడం లేదు. హుస్సేన్‌పురం నుంచి సామర్లకోట వరకు గోదావరి కాలువలో గుర్రపు డెక్క ఎక్కువగా పేరుకుపోయి ఉండడంతో నీటి మట్టం తక్కువగా ఉందని రైతులు అంటున్నారు.

ఈ నీటి కింద 18వేల ఎకరాల్లో సాగు

మండల పరిధిలో 24 వేల ఎకరాల్లో వరి సాగుకు అవకాశం ఉండగా, గోదావరి కాలువ నీరు ఆధారంగా 18 వేల ఎకరాలు సాగవుతాయి. అధిక సంఖ్యలో రైతులు వెదజల్లు సాగు చేస్తుండడంతో నీటి ఆవశ్యకత ఎక్కువగా ఉంటుంది. పీబీ దేవం నుంచి వేట్లపాలెం వరకు పంట పొలాలకు నీరు సక్రమంగా అందడంతో రైతులు దమ్ములు చేసుకుని సాగుకు సన్నద్ధం అవుతున్నారు.


సామర్లకోట గోదావరి కాలువలో హుస్సేన్‌పురం వద్ద మేట వేసిన గుర్రపు డెక్క

అధికారుల నిర్లక్ష్యంతో సాగుకు ఇబ్బంది



నీటిపారుదల అధికారులు సకాలంలో గుర్రపు డెక్కను తొలగించక పోవడం వల్ల సకాలంలో పంటలకు సమృద్ధిగా నీరు అందడం లేదు. క్లోజర్ సమయంలో దుంపతో సహా తూడు తొలగిస్తే ఈ సమస్య ఉండేది కాదు.
– నేతల హరిబాబు, రైతు, సామర్లకోట

టెండర్లు పిలిచాం



సామర్లకోట గోదావరి కాలువలో గుర్రపు డెక్కను తొలగించడానికి టెండర్లు పిలిచాం. బిక్కవోలు నుంచి సామర్లకోట వరకు గుర్రపు డెక్క తొలగిస్తాం. హుస్సేన్‌పురం నుంచి సామర్లకోట వరకు పెరిగిన పూడికకు ప్రత్యేకంగా టెండర్లు పిలవాల్సి ఉంటుంది.
– నాగేశ్వరరావు, ఇరిగేషన్ ఏఈ, సామర్లకోట

భక్తులకు ఇబ్బందులు రానీయొద్దు


నూతన ఉత్సవ కమిటీతో మున్సిపల్ వైస్ చైర్మన్ సాయి ప్రసాద్

పెద్దాపురం: ఆషాఢ మాసంలో నిర్వహించే మరిడమ్మ జాతర ఉత్సవాల్లో భాగంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్ అన్నారు. జాతర ఉత్సవాల్లో భాగంగా 9 మంది నూతన ఉత్సవ కమిటీ సభ్యులతో కలసి గురువారం అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ రామ్మోహనరావుల ఆధ్వర్యంలో నూతన కమిటీకి వేదపడింతులు ఆశీర్వచనం అందజేశారు. తొలుత ఇన్‌చార్జి ఆర్డీఓ సత్యనారాయణ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నేత్రపర్వంగా పాండురంగ కల్యాణం

- భక్తిశ్రద్ధలతో ఏకాదశి పూజలు

సామర్లకోట: రుక్మిణీ సమేత పాండురంగ స్వామి కల్యాణం గురువారం నేత్ర పర్వంగా జరిగింది. స్థానిక ప్రసన్నాంజ నేయస్వామి ఆలయం వద్ద కొలువైన పాండురంగ స్వామి ఆలయంలో ఏటా ఆషాఢ శుద్ధ ఏకాదశి పర్వదినాన స్వామి వారి కల్యాణం నిర్వహించడం ఆనవాయితీ. స్వామివారి దర్శనానికి జిల్లా నలుమూలల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. ఆలయ ధర్మకర్తలు ఆయోద్యల పద్మ రాజేంద్రకుమార్, రాజేష్ భక్తులకు ఏర్పాట్లు చేశారు. నూతన దంపతులు స్వామిని దర్శిస్తే సత్వరమే సంతానం కలుగుతుందని భక్తుల విశ్వాసం. దీంతో నూతన దంపతులు వధూవరులుగా తయారై స్వామి వారిని దర్శించుకున్నారు. సుమారు 190 ఏళ్ల క్రితం నాటి ఆలయం కావడంతో ఒకవైపు మార్గం మాత్రమే ఏర్పాటు చేశారు. ఆలయం నుంచి కిలోమీటరు పొడవున భక్తులు బారులు తీరారు. ట్రాఫిక్ ఎస్సై ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ఎనిమిది మంది దంపతులు పీటలపై కూర్చుని కల్యాణం జరిపించారు. పంచారామ క్షేత్ర అభిషేక పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, చంటి వేద మంత్రాల నడుమ కల్యాణం జరిపించారు. భక్తులకు ఆలయ ధర్మకర్తల ఆధ్వర్యంలో పానకం, చక్కెర పొంగలి, పులిహోర ప్రసాదాలను అందజేశారు.

సామర్లకోటలో..

సామర్లకోట: ఆషాఢ తొలి ఏకాదశి సందర్భంగా పంచరామ క్షేత్రం బాలత్రిపుర సుందరి సమేత కుమార రామభీమేశ్వరస్వామి ఆలయంలో లక్ష్మీ సమేత విష్ణుమూర్తి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఈఓ డి.నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో పంచామృతాలతో అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. అలాగే అతి పురాతన మాండవ్యనారాయణస్వామి ఆలయంలో, విఘ్నేశ్వర థియేటర్ ఎదుట ఉన్న వేణుగోపాలుని ఆలయంలో, పాత సామర్లకోటలోని వేణుగోపాల స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

ప్రత్యేక పూజలు

కొత్తపల్లి: తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి, సాయిబాబా, ఉప్పాడ వేంకటేశ్వరస్వామి, ఐశ్వర్యసాయి, సాయిబాబా, కొమరగిరిలోని సాయిబాబా, వేణుగోపాలస్వామి, గొర్సలో పురాతన రామాలయం, రమణక్కపేట విజయ జనార్దనస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

కిటకిటలాడిన ఆలయాలు

పెద్దాపురం: మండలంలోని అర్బన్, రూరల్ ప్రాంతాల్లోని కట్టమూరు, చదలాడ, కాండ్రకోట, గుడివాడ, గోరింట, పులిమేరు, దివిలి, తాటిపర్తి గ్రామాలతో పాటు ఆయా గ్రామాల్లో తొలి ఏకాదశి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. చదలాడలో పాండురంగస్వామి ఆలయంలో పలువురు దంపతులు పీటలపై ఆశీనులై స్వామివారి కళ్యాణాన్ని నిర్వహించారు. కాండ్రకోటలో కృష్ణాలయంలో విష్ణు సహస్రనామ పారాయణం నిర్వహించగా, సత్తిరెడ్డిపేటలో గీతా పారాయణ, గుడివాడలో ఏకాహం నిర్వహించారు.


సామర్లకోటలోని రుక్మిణి సమేత పాండురంగ స్వామి కల్యాణం


మాండవ్య నారాయణస్వామి

నందీశ్వరునికి ప్రత్యేక పూజలు

పిఠాపురం: స్థానిక పాదగయ కుక్కుటేశ్వరస్వామి దేవస్థానంలో గురువారం తొలి ఏకాదశి సందర్భంగా నందీశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు నందీశ్వరునికి విశేష అలంకరణ చేయగా ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ ఆగంటి ప్రభాకరరావు, ఈఓ వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వందలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

తాటిపర్తిలో...

గొల్లప్రోలు మండలం తాటిపర్తి అపర్ణాదేవి ఆలయంలో నందీశ్వరునికి ఉయదం సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు, సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విశేష అలంకరణలో స్వామివారు దర్శనమివ్వగా అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో గారపాటి బుజ్జి, ఆకొండి వెంకటేశ్వరశర్మ, ఉప సర్పంచ్ దాసం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.


పాదగయ క్షేత్రంలో ప్రత్యేక అలంకరణలో నందీశ్వరుడు


తాటిపర్తిలో నందీశ్వరునికి పూజలు చేస్తున్న అర్చకులు

లబ్ధిదారులకు జగనన్న సురక్ష

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు

పిఠాపురం: జగనన్న సురక్ష కార్యక్రమం ప్రభుత్వ పథకాల లబ్ధిదారులకు రక్షణగా ఉంటుందని ఎమ్మెల్యే పెండెం దొరబాబు తెలిపారు. పిఠాపురం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ప్రజా సంక్షేమమే పరమావధిగా పని చేస్తున్నారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేశారన్నారు. గ్రామాల్లో ఒక శాతం మందికి వివిధ కారణాల వల్ల ప్రభుత్వ పథకాలు అందడం లేదని, వారికి పథకాలు అందించడమే లక్ష్యంగా జగనన్న సురక్ష కార్యక్రమం చేపట్టారన్నారు. అర్హత కలిగి ఉండి ప్రభుత్వ పథకాలు అందని వారిని గుర్తించి వారికి పథకాన్ని అందజేస్తామన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులకు అవసరమైన జనన, మరణ, నివాస, భూమిహక్కు పత్రాలు తదితర సర్టిఫికెట్లను అధికారులు అందజేస్తారన్నారు. ఇప్పటికే అన్ని గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో జగనన్న సురక్షపై అవగాహన సదస్సులు నిర్వహించారన్నారు. వచ్చే నెల 1వ తేదీ నుంచి నెల రోజుల పాటు అర్హులకు అవసరమైన ధ్రువపత్రాలను మంజూరు చేస్తారన్నారు. కార్యక్రమంలో జిల్లా వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షుడు కొప్పన శివనాథ్, ఎంపీపీ కన్నాబత్తుల కామేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నేతలు గండేపల్లి బాబీ, గండ్రేటి శ్రీరామచంద్రమూర్తి, అరిగెల రామయ్యదొర, కడింశెట్టి భాస్కర రెడ్డి, జ్యోతుల భీముడు, మొగలి అయ్యారావు, పర్ల రాజా, ఆనాల సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

ఘనంగా బక్రీద్ వేడుకలు


పెద్దాపురంలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


సామర్లకోటలో ప్రార్థన చేస్తున్న ముస్లింలు

పెద్దాపురం: పవిత్ర ఈదుల్ జహా (బక్రీద్) పర్వదినాన్ని పట్టణంలో గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఈద్గా మెట్ట వద్ద అగ్రో డైరెక్టర్ సయ్యద్ కరీమ్ జానీ ఆధ్వర్యంలో ఈద్ నమాజ్ ఆచరించారు. అనంతరం మత బోధలు చేశారు. సయ్యద్ జానీ మాట్లాడుతూ సృష్టికర్త ఆదేశాను సారం తన త్యాగనిరతిని నిరూపించుకున్న ప్రవక్త ఇబ్రహీం మార్గాన్ని ప్రతి ముస్లిం ఆచరించాలన్నారు. కార్యక్రమంలో సయ్యద్ ఖాదర్, మక్బుల్ జానీ, జానీ, ముక్తార్ అలీ తదితరులు పాల్గొన్నారు.

సామర్లకోటలో..

సామర్లకోట: పట్టణ పరిధిలోని మసీదుల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పిఠాపురం రోడ్డులో ఉన్న మసీదులు, పెన్షన్‌లైన్‌లో ఉన్న మసీదులో, పోలీసుస్టేషన్ ఎదుట ఉన్న కోటమ్మ చెరువు వద్ద ఉన్న దర్గాలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

తరగతులు యథావిధిగా కొనసాగించాలని వినతి


జిల్లా విద్యాశాఖాధికారి అన్నపూర్ణకు వినతి పత్రం అందిస్తున్న ఆనాల సుదర్శన్

కొత్తపల్లి: ప్రాథమిక పాఠశాలల్లో 3,4,5 తరగతులను యథావిధిగా కొనసాగించాలని, లేని పక్షంలో విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలనివె వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు ఆనాల సుదర్శన్ కోరారు. ఈ మేరకు గురువారం జిల్లా విద్యాశాఖాధికారి అన్నపూర్ణకు వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన విద్యావిధానం వలన శివారు గ్రామాల విద్యార్థులు పాఠశాలలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మండలంలోని కుతుకుడుమిల్లి శివారు నిదానందొడ్డి, పెదకలవలదొడ్డిలో విద్యార్థులు వాకతిప్ప జిల్లా పరిషత్ హైస్కూల్‌కు, కొమరగిరి శివారు అనందనగర్, నాగంపేట, కామన్నగారిపాలెం గ్రామాల విద్యార్థులు కొమరగిరి హైస్కూల్‌కు నాలుగు కిలోమీటర్ల మేర నడిచి రావలసిన దుస్థితి నెలకొందన్నారు. దీంతో కొండెవరం శివారు శొంఠవారిపాకలు, కాశివారిపాకలుతో పాటు పలు శివారు గ్రామాల్లో విద్యార్థులను పాఠశాలలకు పంపాలంటే తల్లిదండ్రులు భయపడుతున్నారు. ప్రాథమిక పాఠశాలల్లో తరగతులను యథావిధిగా నిర్వహించని పక్షాన శివారు గ్రామాల్లోని విద్యార్థులు పాఠశాలలకు వెళ్లేందుకు ప్రభుత్వం బస్సు సౌకర్యం కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలి

కొత్తపల్లి: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని తహసీల్దార్ ప్రసాద్ సూచించారు. మండలంలోని పొన్నాడ శివారు కోనపాపపేట ప్రభుత్వ లే అవుట్‌లో ఇళ్ల నిర్మాణ పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అమరవిల్లి, పొన్నాడ, కొమరగిరి, రమణక్కపేట జగనన్న కాలనీల్లో లబ్ధిదారులు త్వరగా ఇళ్ల నిర్మాణ పనులు చేపట్టాలన్నారు. లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్టు తెలిపారు.

ఆవాసాల మధ్య అధ్వానం


వ్యర్థాలతో నిండిపోయిన డ్రైన్

సామర్లకోట: స్థానిక 25వ వార్డులో ప్రధాన డ్రైను పూడిక తీతకు నోచుకొనక పోవడంతో ఆ వార్డు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. వెలంపేట రామాలయం వీధిలో ఇళ్ల మధ్యగా ఉన్న ప్రధాన డ్రైనులో వ్యర్థాలు నిలచిపోయి దోమలకు నిలయంగా మారుతోంది. డ్రైనులో పూడిక తీయించి, దోమల నివారణకు మందు పిచికారీ చేసి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

గృహ సారథుల మండల ఇన్‌చార్జిలు వీరే

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గురువారం కేంద్ర పార్టీ మండల కన్వీనర్లను నిమమించారు. పెద్దాపురం నియోజకవర్గానికి సంబంధించి పెద్దాపురం మండలానికి గోపు సత్యకృష్ణ, పెద్దాపురం మున్సిపాలిటికీ చింతా శ్రీనివాసరావును, సామర్లకోట మండలానికి ఊటా వాసును, సామర్లకోట మున్సిపాలిటికీ ఇరుసు మల్ల సాయి సత్యనారాయణను నియమించారు. అలాగే పిఠాపురం నియోజకవర్గానికి సంబంధించి గొల్లప్రోలు మండలానికి దాసం వేంకటేశ్వర చక్రధర్, గొల్లప్రోలు నగర పంచాయతీకి మొగలి సాంబశివరావు, పిఠాపురం మండలానికి కన్నాబత్తుల కామేశ్వరరావు, మున్సిపాలిటీకి బాలిపిల్లి రాంబాబు, యు.కొత్తపల్లికి ఉమ్మిడి జాన్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

బాలికల భద్రతపై అవగాహన సదస్సు


బాలికలతో కలసి దిశ అవగాహన పోస్టర్‌ను ప్రదర్శిస్తున్న వన్ స్టాప్ సెంటర్ బృందం

కాకినాడ క్రైం: కాకినాడ జీజీహెచ్ దిశ వన్ స్టాప్ సెంటర్ ఆధ్వర్యంలో గురువారం ఓ చర్చిలో బాలికల భద్రతపై అవగాహన సదస్సు జరిగింది. కాకినాడ పాతబస్టాండు ప్రాంతంలో జెహోవా షమ్మా ప్రార్థనా మందిరంలో పాస్టర్ కనుమూరి మోజెస్ బ్రెన్‌హం పర్యవేక్షణలో ఈ సదస్సును నిర్వహించారు. దిశ వన్‌స్టాప్ సెంటర్ అడ్మిన్ ఆర్.శైలజ ఆధ్వర్యంలో ఏఎస్‌ఐ చంద్ర, కేస్ వర్కర్ కె.ప్రవీణ మాట్లాడుతూ బాలికల భద్రతపై పలు సూచనలు ఇచ్చారు. గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌ను వివరించారు. బాలికలు, మహిళల భద్రత కోసం ఏర్పాటైన చట్టాలపై అవగాహన కల్పించారు. లైంగిక వేధింపులకు గురైతే దాచుకోకుండా తక్షణమే తల్లిదండ్రులకు తెలియచేయాలని సూచించారు. సమాజంలో బాలికలు, స్త్రీలపై జరుగుతున్న అకృత్యాలను వివరిస్తూ తమను తాము రక్షించుకునేందుకు అనుసరించాల్సిన విధానాలపై అవగాహన కల్పించారు. అనంతరం దిశ భద్రత పోస్టర్‌ను పిల్లలతో కలసి సిబ్బంది ప్రదర్శించారు. ఈ సదస్సులో దిశ ఐటీ వింగ్ దుర్గాదేవి సహా సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

నేడు పబ్లిక్ హెల్త్ యూనిట్‌కు శంకుస్థాపన

కిర్లంపూడి: మండలంలోని గెద్దానాపల్లి ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో నూతన బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ (ల్యాబ్) నిర్మాణానికి శుక్రవారం ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు శంకుస్థాపన చేస్తారని ఎంపీపీ తోట రవి గురువారం తెలిపారు.

పూర్తయిన పనుల కోసం ఆందోళనలా..?

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

పిఠాపురం: పూర్తయిపోయిన పనులు పూర్తి చేయాలంటూ టీడీపీ నేతలు ఆందోళనకు దిగడం విడ్డూరంగా ఉందని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. ఆయన గురువారం పిఠాపురంలో విలేకర్లతో మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి టిడ్కో గృహాల పంపిణీకి ఇటీవల శ్రీకారం చుట్టారన్నారు. పిఠాపురం పట్టణంలోని టిడ్కో గృహాల ప్రారంభానికి అన్ని చర్యలు తీసుకున్నారన్నారు. అన్ని చోట్ల టిడ్కో గృహాల పంపిణీకి అధికారులు ఏర్పాట్లు చేస్తుంటే అదంతా తమ ప్రభావమే అని చూపించుకోవాలని టీడీపీ నేతలు నాటకాలు ప్రారంభించారన్నారు. టిడ్కో గృహాలు పంపిణీ చేయాలని పిఠాపురంలో టీడీపీ నేతలు నిరాహార దీక్షలు చేయడం చూసి జనం నవ్వుకుంటున్నారన్నారు. ఒక్క రూపాయికే టిడ్కో గృహాలను లబ్ధిదారుల పేరున రిజిస్ట్రేషన్లు చేసి ప్రభుత్వం అప్పగిస్తుంటే టీడీపీ నేతలు ఆందోళనలు చేయడం దారుణమన్నారు. ఈ నెలాఖరుకు గృహాలు పంపిణీ చేస్తామని ప్రభుత్వం ముందుగానే ప్రకటించిన విషయాన్ని గమనించిన పచ్చ పార్టీ నేతలు దొంగ నాటకాలకు తెరలేపారని విమర్శించారు. ఎవరో చెబితేనే గాని ఇవ్వలేని స్థితిలో ప్రభుత్వం లేదని, ఇకనైనా దొంగ నాటకాలు కట్టిపెట్టాలని టీడీపీ నేతలకు హితవు పలికారు. కార్యక్రమంలో జిల్లా వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షుడు కొప్పన శివనాథ్, ఎంపీపీ కన్నాబత్తుల కామేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నేతలు గండేపల్లి బాబీ, గండ్రేటి శ్రీరామచంద్రమూర్తి, అరిగెల రామయ్యదొర, కడింశెట్టి భాస్కరరెడ్డి, జ్యోతుల భీముడు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ


అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న వైస్ చైర్మన్ సాయిప్రసాద్

పెద్దాపురం: పట్టణాభివృద్ధే ధ్యేయంగా మున్సిపల్ కౌన్సిల్ పాలన సాగిస్తుందని పెద్దాపురం మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, ఆప్కో మాజీ డైరెక్టర్ ముప్పన వీర్రాజు అన్నారు. పట్టణంలోని బంగారమ్మ గుడివీధి, దర్గా సెంటర్ ప్రాంతంలోని పలు అభివృద్ధి పనులకు వారు గురువారం వారు భూమిపూజ చేశారు. పట్టణ ప్రజలు పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు. అందుకు అవసరమైన డ్రైన్లు, రోడ్డు నిర్మాణ పనులు ముమ్మరం చేశామన్నారు. ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు ఆధ్వర్యంలో పట్టణాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు తమ వంతు కృషి చేస్తున్నామని వారన్నారు. వారితో పాటు మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర, అగ్రో డైరెక్టర్ సయ్యద్ జానీ, కౌన్సిలర్లు విడదాసరి రాజా, సిమ్మా సూర్యావతి, గోకేడ అప్పారావు, మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యులు వాసంశెట్టి గంగ, షేక్ రఫీ, డిఈ ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

తుని: స్థానిక ఆర్టీసీ డిపోలో శుక్రవారం డయిల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ ఎన్.కిరణ్‌కుమార్ గురువారం తెలిపారు. ఉదయం 11 నుంచి 12 గంటల వరకూ నిర్వహించే ఈ కార్యక్రమంలో ప్రయాణికులు తమ సమస్యలను తెలియజేయవచ్చన్నారు. ప్రయాణికులు 73827 81490 నంబరుకు ఫోన్ చేసి సమస్యలు తెలిపాలని కోరారు.

ఏలేశ్వరం: స్థానిక ఆర్టీసీ డిపో కార్యాలయంలో శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్టు డిపో మేనేజర్ జి.సత్యనారాయణ గురువారం తెలిపారు. ప్రయాణికులు సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకూ 99592 25532 నంబర్‌కు కాల్ చేయాలని కోరారు.